# 'ఆర్థిక సంక్షోభం- అసలు నిజాలు' అంశంపై సభ




వేదికపై వరుసగా ప్రొ॥జ్యోతిరాణి, ప్రొ॥కె.ఆర్.చౌదరి, డా॥సుధీర్, డా॥జస్వంతరావు

**హైదరాబాద్, 17-11-19:**

**ఆర్థిక సంక్షోభం - అసలు నిజాలు అన్న అంశంపై తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 17. 11.19న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం మినీ హాల్లో సభ జరిగింది. ఈ సభకు టిఎన్ మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు డా. వై. సుధీర్ అధ్యక్షత వహించారు.**

ఈ సభలో వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కె. ఆర్. చౌదరి మాట్లాడుతూ తరిమెల నాగిరెడ్డిగారు గొప్ప మేధావి అని, అసెంబ్లీ పార్లమెంటులు బాతాఖానీ క్లబ్బులుగా మారాయని, దానివల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని, పోరాటాల ద్వారా మాత్రమే ఈ సంక్షోభాన్ని అధిగమించగలరు అని, ప్రస్తుత వ్యవస్థని మార్చినప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని టిఎన్ చెప్పారని ఆయన గుర్తు చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా పాలకులు అరకొర పథకాల్ని ప్రవేశపెడుతున్నారని, భూమి పంపకం జరగడం లేదన్నారు. ప్రభుత్వం భూమిని రైతుల దగ్గర నుండి గుంజుకుంటున్నదని, దానివల్ల వారి సమస్యలు పెరుగుతున్నాయి గాని తగ్గటం లేదని చెప్పారు.

కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి మాట్లాడుతూ తరిమెల నాగిరెడ్డిగారు 1970లలోనే భారతదేశం తాకట్టు పెట్టబడిందని అన్నారని, అప్పుడే అనేక సంక్షోభాల గురించి చెప్పారని, అంతకన్నా తీవ్రమైన పరిస్థితులు నేటికీ కొనసాగుతున్నాయని చెప్పారు. దేశ ప్రజలు ఉత్పత్తి చేసిన వస్తువులకు కూడా గిట్టుబాటు ధర లభించడం లేదని, దానివల్ల నిరుద్యోగిత పెరుగుతున్నదని అన్నారు. ఆటోమొబైల్ రంగంలో సంక్షోభం ఉందని, ఉద్యోగులను తొలగిస్తున్నారనీ, నిరుద్యోగిత పెరుగుతోందని, రోజురోజుకూ అన్ని రంగాలనీ ప్రైవేటీకరించడం తీవ్రమవుతుందని చెప్పారు. ఆర్థిక సంక్షోభం పేరుతో పెట్టుబడిదారీ కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన విధానాలను పాలకులు ఏవిధంగా అమలుచేస్తున్నారో వివరించారు. 1.45 లక్షల కోట్ల రూ॥లు కార్పొరేట్లకు రాయితీలు ఇవ్వడం ఎవరిని సంక్షోభం నుంచి బయట పడవేయడానికని విమర్శించారు. అన్నిరంగాల్ని ప్రైవేటీకరిస్తూ, పర్యావరణాన్ని విధ్వంసం చేస్తూ ప్రజల జీవితాల్ని సంక్షోభంలోకి నెడుతున్న పాలకుల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజల్ని సంఘటితపరచి ప్రజలకు అనుకూలమైన నిర్మాణాల్ని ఏర్పరుచుకోవడానికి ఇదే సరైన సమయం అని అన్నారు.

తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ పి. జశ్వంత రావు మాట్లాడుతూ ప్రజల అవసరాలు తీర్చగల పరిశ్రమలన్నీ కునారిల్లు తున్నాయి కానీ సంపన్నులకు అవసరమైన పరిశ్రమలన్నీ లాభాల్లో నడుస్తున్నాయని, ఇది ఎలా సాధ్యమైంది అని ప్రశ్నించారు. ప్రభుత్వం వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్న దాని ఫలితమే నేడు మనం చూస్తున్న సంక్షోభం అని అన్నారు. సెల్‌ఫోన్ కంపెనీలు 24 లక్షల కోట్ల రూపాయల్ని రాయల్టీ రూపంలో తరలించుకు పోయాయి కానీ ప్రభుత్వానికి పన్ను చెల్లించలేదన్నారు. ఈ దేశపు జీడీపీలో 60 శాతం విదేశాలకు తరలించుకు పోతున్నారని అన్నారు. మన దేశంలో కొత్త కంపెనీలు స్థాపించడం లేదని, ఫార్మా గానీ, సాఫ్ట్‌వేర్ గాని విదేశీ మదుపు ఉన్నవే ఎక్కువని, వైద్యరంగం అంతా విదేశీ కంపెనీల చేతుల్లోకి వెళ్ళిపోయిందన్నారు. గత నలభై సంవత్సరాలుగా ప్రజల్ని మత ప్రాతిపదికన, వివిధ రూపాల్లో విడదీస్తూ పాలకులు తమ విధానాల్ని అమలు చేసుకుంటున్నారని వివరించారు.

ఈ సభ గురించి కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. సభలో 150 మంది వరకు పాల్గొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంక్షోభం మీద విజ్ఞానదాయకంగా సభ జరిగింది.

ooo